## క్లుప్తంగా

### ఐఏఎస్ స్మితా సబర్వాల్‌ను అనర్హురాలిగా ప్రకటించాలి




నిరసన తెలుపుతున్న నాయకులు

**భానుపురి :** వికలాంగులను కించపర్చిన ఐఏఎస్ స్మితా సబర్వాల్‌ను అనర్హురాలిగా ప్రకటించాలని వికలాంగుల హక్కుల జాతీయ వేదిక జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు అర్వపల్లి లింగయ్య, వీర వెంకన్న డిమాండ్ చేశారు. మంగళవారం పట్టణంలోని పాత బస్టాండ్ సెంటర్‌లో సంఘం ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీనియర్ ఐఏఎస్ అధికారిగా పనిచేస్తున్న స్మిత సబర్వాల్ వికలాంగులను కించపరిచేలా ఈనెల 21న ట్విట్టర్‌లో పోస్ట్ పెట్టారని తెలిపారు. ఆమె తన వైఖరిని మార్చుకోవాలని, లేదంటే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. కార్యక్రమంలో వికలాంగుల హక్కుల జాతీయ వేదిక జిల్లా నాయకులు శిరం శెట్టి రామారావు, రమేష్, వెంకట్, నాగేశ్వరరావు, వనిత, చంద్రమ్మ తదితరులు పాల్గొన్నారు.

### కాంగ్రెస్ నాయకుడి మృతి

**అర్వపల్లి:** మండల పరిధిలోని తిమ్మాపురం గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు మామిడి ముత్తయ్య మంగళవారం అనారోగ్యంతో మృతి చెందాడు. ఆయన మృతదేహాన్ని కాంగ్రెస్ నాయకులు సందర్శించి నివాళులర్పించారు. మృతుడి కుటుంబీకులను పరామర్శించి సంతాపం తెలిపారు. నివాళులర్పించిన వారిలో గ్రామ శాఖ అధ్యక్షుడు వేముల కొండ ఉప్పలయ్య, మాజీ సర్పంచ్ పాలెల్లి సురేష్, రత్నం లక్ష్మాజి, కొణతం కరుణాకర్ రెడ్డి, భాస్కర్, నాగేందర్ ఉన్నారు.

### టీఎస్‌యూటీఎఫ్ ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు

**తిరుమలగిరి :** తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మంగళవారం తిరుమలగిరి, అనంతారం, తాటిపాముల, వెలిశాల, గుండెపురి పాఠశాలలో సభ్యత్వ నమోదు ప్రారంభించారు. కార్యక్రమంలో జిల్లా కోశాధికారి జి.వెంకటయ్య, కార్యదర్శి సోమయ్య, మండల అధ్యక్షులు సి.హెచ్.సోమయ్య, ప్రధాన కార్యదర్శి వివిఎల్ ఎస్.చార్యులు పాల్గొన్నారు.

### పంటను ధ్వంసం చేసిన వారిపై చర్య తీసుకోవాలి

**తిరుమలగిరి :** తమ పెసర పంటను ధ్వంసం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని బాధితురాలు నెమురుగొమ్ముల వనజాత కోరారు. మంగళవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. మండల పరిధిలోని తొండ గ్రామంలో సర్వే నెం.415, 422, 423 నెంబర్లలో 2018వ సంవత్సరంలో 4.18 ఎకరాల భూమిని కొనుగోలు చేశామని తెలిపారు. ఈ సంవత్సరం ఆ భూమిలో పెసర పంట వేయగా మాజీ ఎంపీపీ అనుచరులు వచ్చి పెసర పంటను ధ్వంసం చేశారని ఆరోపించారు. వారిపై కేసులు నమోదు చేసి న్యాయం చేయాలని కోరారు.

### విద్యార్థులకు నోటు పుస్తకాల పంపిణీ



పుస్తకాలు పంపిణీ చేస్తున్న సాయిరెడ్డి

**మద్దిరాల :** మండల పరిధిలోని చందుపట్ల గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు గ్రామానికి చెందిన రిటైర్డ్ ప్రధానోపాధ్యాయుడు తీకుల సాయిరెడ్డి మంగళవారం నోటు పుస్తకాలు,పెన్నులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎండి ఖాజా ముజీబుద్దీన్, ఉపాధ్యాయులు శ్రీనివాస్,తీకుల సుధాకర్‌రెడ్డి,వాసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి,సోమిరెడ్డి, వెంకన్న పాల్గొన్నారు.

### మెరుగైన వైద్య సేవలు అందించాలి



రికార్డులు పరిశీలిస్తున్న పీఓ కోటిరత్నం

**అర్వపల్లి:** వైద్య సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉంటూ మెరుగైన వైద్యసేవలు అందించాలని జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారిణి డాక్టర్ కోటిరత్నం కోరారు. జాజిరెడ్డిగూడెం మండలం తిమ్మాపురం పల్లెదవాఖానను మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులు పరిశీలించి మాట్లాడుతూ వైద్య సిబ్బంది స్థానికంగా ఉంటూ సీజనల్ వ్యాధులపట్ల ప్రజలను అప్రమత్తంగా ఉంచాలన్నారు. కార్యక్రమంలో సీహెచ్ఓ ఎల్.చరణ్, ఎంఎల్‌హెచ్‌పి జి.వాణి, వైద్య సిబ్బంది, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

# నిత్యావసర ధరలు పైపైకి..

- ప్రతి వస్తువుపై రూ.10కి పైగా పెరుగుదల
- ఇబ్బందులు పడుతున్న సామాన్యులు

**తిరుమలగిరి :** రోజు రోజుకూ నిత్యావసర సరుకుల ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. డీజిల్, పెట్రోల్, బియ్యం, పప్పులు, కూరగాయల ధరలు ఒక దానితో మరొకటి పోటీ పడి పెరిగి పోతున్నాయి. ప్రభుత్వ పరంగా చౌక ధరలు దుకాణాల ద్వారా నిత్యం అవసరమయ్యే ఈ సరుకులను రాయితీ ధరలకు విక్రయించి దారిద్ర్య రేఖ దిగువన ఉన్న ప్రజలను ఆదుకోవాల్సి ఉన్నప్పటికీ కేవలం దొడ్డు బియ్యం ఉచితంగా ఇచ్చి ప్రభుత్వం చేతులు దులుపుకుంటుంది. చక్కెర, గోధుమల వంటివి అంత్యోదయ,అన్నపూర్ణ కార్డులు ఉన్న వారికి మాత్రమే అప్పుడప్పుడు పంపిణీ చేస్తున్నాయి.

**ఒక్కో వస్తువుపై..**

కొద్ది రోజులుగా ధరలు పెరిగి పోతూనే ఉన్నాయి. దాదాపుగా సంవత్సరంలోనే ఒక్కో వస్తువుపై 20 నుంచి 30 శాతం వరకు ధరలు పెరగడంతో సామాన్యులు ఇబ్బందులు పడుతున్నారు. హోల్ సేల్ వ్యాపారుల నుంచి చిన్న వ్యాపారుల వరకు ధరలు



పెరుగుతుండటంతో గతంలో కంటే వ్యాపారాలు పూర్తిగా తగ్గి పోయాయని వాపోతున్నారు. బియ్యం , నూనె, ఉల్లిగడ్డ, పప్పుల ధరలు భారీగా పెరగడంతో సామాన్యులు కొనలేని పరిస్థితులు నెలకొంటున్నాయి. రెండు నెలల్లోనే బియ్యం, పప్పులు, ఉల్లిగడ్డ ధరలు కేజీకి రూ.10 నుంచి రూ.30 వరకు పెరిగాయి. దీనికి తోడు కూరగాయల ధరలు కూడా ఆకాశాన్నంటుతున్నాయి. గతంలో స్థానికంగానే రైతులు కూరగాయలు పండించే వారు. ప్రస్తుతం కోతుల బెడద అధికం కావడంతో గ్రామాలకు సైతం హైదరాబాద్, ఇతర ప్రాంతాల నుంచి కూరగాయలను దిగుమతి చేసుకోవాల్సిన పరిస్థితి నెలకొన్నది.

**బియ్యం ధరలు భారీగా పెరిగాయి**

సన్న బియ్యం మార్కెట్‌లో కిలో రూ.50కి పైగానే విక్రయిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం కిలో రూ.29లకే భారత్ రైస్ పేరుతో 10 కిలోల బస్తాలను మార్కెట్‌లో విక్రయిస్తున్నామని చెబుతున్నప్పటికీ ఎక్కడా కనిపించడం లేదు. ధరల నియంత్రణపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

– మహేందర్, తిరుమలగిరి

**రేషన్ దుకాణాల్లో పంపిణీ చేయాలి**

నెలకు రూ.5 వేలు ఖర్చు చేస్తే తప్ప నెలవారీ సామగ్రి కనిపించడం లేదు. కూరగాయలకు వారానికి రూ.500 వెచ్చించాల్సి వస్తుంది. గతంలో 9 రకాల వస్తువులను రేషన్ దుకాణాల్లో సబ్సిడీ ధరలకు ఇచ్చే వారు. ప్రభుత్వం ఆ దిశగా ఆలోచించాలి.

– వెంకన్న, తిరుమలగిరి

## కార్మికులు లేబర్ కార్డు తీసుకోవాలి

**సూర్యాపేట:** పట్టణంలోని ప్రతి ఒక్క భవన నిర్మాణ కార్మికుడు ప్రభుత్వం అందజేసే లేబర్ కార్డు తీసుకోవాలని డివిజన్ తాపీ పని వివరాల సంఘం జిల్లా అధ్యక్షుడు వల్దాసు శ్రీను కోరారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ఆ సంఘ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. భవన నిర్మాణ కార్మికులు లేబర్ కార్డుతో పాటు సంఘం ఐడీ కార్డులు తీసుకున్నట్లయితే ఏ ప్రమాదం జరిగినా ప్రభుత్వంతో పాటు సంఘం కూడా ఆదుకునే అవకాశం ఉంటుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం భవన నిర్మాన కార్మికుల సంక్షేమానికి పెద్దపీట వేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో సంఘం గౌవర అధ్యక్షుడు గుత్తి నగేష్, ప్రధాన కార్యదర్శి కోట శ్రవణ్, ఉపాధ్యక్షుడు ఇరుగుదిండ్ల అం



సమావేశంలో మాట్లాడుతున్న రెబల్ శ్రీను

జయ్య, సహాయ కార్యదర్శి కుంచం రవి, కోశాధికారి పోలగాని భిక్షంగౌడ్, ఆర్గనైజర్ వంగూరి డానియేల్, నామ సైదులు, గోనె నాగయ్య, మల్లెల నర్సిరెడ్డి, మామిడి గౌరయ్య, జానీపాషా, పడిదల శ్రీను, నరసింహ, శ్రీనివాస్‌రెడ్డి, కొండయ్య, వెంకటరెడ్డి, రవికుమార్, శ్రీను పాల్గొన్నారు.

### గీత కార్మికులకు సేఫ్టీ మోకుల పంపిణీ హర్షణీయం

**అర్వపల్లి:** గీత కార్మికులకు ఎలాంటి ప్రాణహాని జరగకుండా ప్రభుత్వం సేఫ్టీ మోకులు అందించడం హర్షణీయమని మోకుదెబ్బ జిల్లా కన్వీనర్ నర్సింగ వెంకటేశ్వర్లుగౌడ్ అన్నారు. మంగళవారం జాజిరెడ్డిగూడెంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. గీత కార్మికులకు కాటమయ్య రక్షణ కవచం పేరుతో సేఫ్టీ మోకులు అందిస్తున్నారని చెప్పారు. గీత కార్మికులకు ఎక్స్‌గ్రేషియా సొమ్మును కూడా సీఎం రేవంత్‌రెడ్డి వెంటనే విడుదల చేయించారని తెలిపారు. సమావేశంలో జేరిపోతుల లక్ష్మణ్‌గౌడ్, రాములు, రామచంద్రు, శ్రీనివాస్, గురువయ్య, బోయపల్లి రాములు పాల్గొన్నారు.

### కాంగ్రెస్ ప్రభుత్వంతోనే అన్నివర్గాలకు మేలు

**అర్వపల్లి:** కాంగ్రెస్ ప్రభుత్వంతోనే అన్ని వర్గాలకు న్యాయం జరుగుతుందని తిమ్మాపురం మాజీ సర్పంచ్, కాంగ్రెస్ నాయకుడు జీడి వీరస్వామి చెప్పారు. మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ ఎన్నికల హామీలో భాగంగా రుణమాఫీ అమలుతో రైతు కుటుంబాల్లో ఆనందం నింపిందని చెప్పారు. రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకంను కొత్తగా 163 వ్యాధులకు విస్తరించడం ద్వారా పేదలకు ఎంతో మేలు జరుగుతుందని చెప్పారు.

### కుక్కల బెడదను నివారించాలని వినతి

**నూతనకల్ :** గ్రామాల్లో కుక్కలు, కోతుల బెడదను నివారించాలని సీపీఐ(ఎంఎల్) మాస్ లైన్ జిల్లా కమిటీ సభ్యులు పేర్ల నాగయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం ఎంపీడీఓ సునితకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ప్రగతి శీల రైతు సంఘం నాయకులు బాణాల వెంకట్‌రెడ్డి, రామిడి రాంరెడ్డి, ఉమేష్, మల్లయ్య, వెంకన్న, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

### నాణ్యమైన భోజనం అందించాలి

**తిరుమలగిరి :** పాఠశాల విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని సూర్యాపేట ఆర్డీఓ కె.వేణుమాధవరావు కోరారు. మంగళవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు మెనూ ప్రకారం కోడిగుడ్లను అందించాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ సుధ తదితరులు పాల్గొన్నారు.

### పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

**నూతనకల్ :** వసతి గృహాల్లోని విద్యార్థులు వ్యాధుల నివారణపై అవగాహన పెంపొందించుకోవాలని మండల వైద్యాధికారి కీసర అశ్రితారెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని బాలుర, బాలికల వసతి గృహాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఆమె సూచించారు. అదే విధంగా వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలన్నారు. కార్యక్రమంలో పీహెచ్ఎన్ తారమ్మ, వైద్య సిబ్బంది జ్యోతి, పుష్పా, మహేష్, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

## కనీస వేతనం అమలు చేయాలి

**ఆత్మకూర్(ఎస్) :** కేజీబీవీ బోధన, బోధనేతర సిబ్బందికి కనీస వేతనం అమలు చేయాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి యామా రమేష్ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. మంగళవారం టీపీయూఎస్ ఆత్మకూరు (యస్ ) మండల శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన సభ్యత్వ నమోదు కార్యక్రమానికిధాయన హాజరై మాట్లాడారు. సుప్రీంకోర్టు నిర్దేశాలకు అనుగుణంగా సమాన పనికి సమాన వేతనం చెల్లించాల్సిన ప్రభుత్వం వీరిపై అధిక పని భారాన్ని మోపుతుందన్నారు. టీపీయూఎస్ ఆధ్వర్యంలో మండలంలోని కోటి నాయక్ తండా, కాల్‌బావు సింగ్ తండా, పాత సూర్యాపేట, ఏనుబాముల, ఆత్మకూర్ , నెమ్మికల్ తదితర గ్రామాల్లోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత, కేజీబీవీ, ఆదర్శ పాఠశాలల్లో సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమం



సభ్యత్వాలు అందిస్తున్న యామా రమేష్

లో జిల్లా కార్యదర్శి పోతుగంటి శ్రీనివాసా చారి, మండల శాఖ అధ్యక్షుడు జూలకంటి వెంకట్ రెడ్డి, సురభి శ్రీధర్, కోట శ్రీనివాస్ రెడ్డి, భరణి, నెరేళ్ల దేవరాజ్, సరిత, జ్యోతి, కనకమ్మ, ఝాన్సీ, భాగ్యలక్ష్మి, కృష్ణవేణి, గీతాంజలి, ఉపేందర్ రావు, శ్రీనివాస్, సుమలత, ఫర్వీన్, శ్రీదేవి, అనురాధ, రజిత, సైదులు, నర్సరాజు పాల్గొన్నారు

## నేర నియంత్రణలో సీసీ కెమెరాల పాత్ర కీలకం



సీసీ కెమెరాలను ప్రారంభిస్తున్న సీఐ శ్రీనివాస్

**నూతనకల్:** సమాజంలో జరుగుతున్న నేరాలను నియంత్రించడంలో సీసీ కెమెరాల పాత్ర కీలమని తుంగతుర్తి సీఐ శ్రీనివాస్ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని ఎర్రపహాడ్ గ్రామంలో జెన్నా రెడ్డి ప్రతాప్‌రెడ్డి ఆర్థిక సహకారంతో రూ. 70వేలు విలువ చేసే సీసీ కెమెరాలను ఏర్పాటు చేయగా వాటిని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీసీ కెమెరాలను ఏర్పాటు చేసిన ప్రతాప్‌రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఐ జూకూరి సైదులు, పీఏసీఎస్ డైరెక్టర్ పసుల వెంకన్న యాదవ్, లింగాల రాములు, పసుల రవి పాల్గొన్నారు.

## నిస్వార్థ సేవకులకే సమాజంలో గుర్తింపు



సన్మానం పొందిన ఉపాధ్యాయులు

**మద్దిరాల :** నిస్వార్థ సేవకులకే సమాజంలో గుర్తింపు లభిస్తుందని పోలుమల్ల జిల్లా పరిషత్ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు బి.శకుంతల అన్నారు. మంగళవారం మండల పరిధిలోని పోలుమల్ల జెడ్పీహెచ్ఎస్‌లో బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులను సన్మానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఉద్యోగికి బదిలీ తప్పని సరి అని అన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎం.వెంకటయ్య, సురాంభ, కె.శ్రీలత, సిహెచ్.వెంకన్న, పి.ఝాన్సీ, కె.అవిలయ్య, ప్రవీణ్‌కుమార్, గార.రాములు తదితరులు పాల్గొన్నారు.




టీచర్లను సన్మానిస్తున్న తోటి ఉపాధ్యాయులు

**ఉపాధ్యాయులకు సన్మానం**

**తిరుమలగిరి :** జలాల్‌పురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బదిలీపై వెళుతున్న షరీఫ్, ఉమారాణి, శ్రీలత, లక్ష్మి, రవిబాబు, రమేష్, హుస్సేన్‌లను మంగళవారం పాఠశాలలో ఉపాధ్యాయులు, సిబ్బంది ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జి.అశోక్ మాట్లాడుతూ ఉపాధ్యాయులు పని చేసిన ప్రతి చోట మంచి విద్యా బోధన అందించాలని కోరారు. కార్యక్రమంలో నారాయణ, రహీమోద్దిన్, గిరిజ, సోమేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

## గోదావరి జలాలు విడుదల చేయాలి

**తుంగతుర్తి :** తుంగతుర్తి ప్రాంతానికి గోదావరి జలాలను వెంటనే విడుదల చేయాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు తాటికొండ సీతయ్య కోరారు. మంగళవారం మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడుతూ వర్షాకాలం ప్రారంభమై దాదాపు 50 రోజులు కావస్తున్నా ఈ ప్రాంతంలో సరైన వర్షాలు కురువక భూగర్భ జలాలు అడుగంటాయని తెలిపారు. రైతులు వరినాట్లు వేసుకోలేక పోతున్నారని పేర్కొన్నారు..ప్రభుత్వం కాలయాపన చేయకుండా సముద్రం పాలవుతున్న నీటిని కాలువలకు మళ్లించి సద్వినియోగం అయ్యేలా చూడాలన్నారు. సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు గుండ గాని



మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

రాములు ,శ్రీనివాస్ ,సాయిలు ,రవికుమార్ తదితరులు పాల్గొన్నారు

## పాత నేరస్తులపై నిఘా ఉంచాలి

**చివ్వెంల :** పాత నేరస్తులపై నిఘా ఉంచాలని ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్ సిబ్బందిని ఆదేశించారు. బుధవారం చివ్వెంల పోలీస్‌స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నిత్యం వాహన తనిఖీ చేపడుతూ ప్రజలకు భద్రతపై భరోసా కల్పించాలన్నారు. కార్యక్రమంలో డీఎస్పీ రవి, సీఐ సురేందర్ రెడ్డి, ఎస్ఐ కనకరత్నం, ఏఎస్ఐ వెంకటేశ్వర్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



పోలీస్ స్టేషన్ పరిసరాలను పరిశీలిస్తున్న ఎస్పీ

## ప్రభుత్వ ఆస్పత్రి అభివృద్ధికి కృషి

- మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్ రెడ్డి

**సూర్యాపేటటౌన్ :** సూర్యాపేట జనరల్ ఆస్పత్రి అభివృద్ధికి కృషి చేస్తామని మాజీ మంత్రి, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జ్ రాంరెడ్డి దామోదర్ రెడ్డి అన్నారు. మంగళవారం ఏఐసీసీ సభ్యుడు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డితో కలిసి ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిని పరిశీలించారు. ప్రస్తుతం జనరల్ ఆసుపత్రిలో 600 బెడ్స్ ఉన్నాయని, రోగుల సంఖ్య పెరుగుతున్నందున 1000 బెడ్లకు పెంచాల్సిన అవసరం ఉందన్నారు. ఆస్పత్రి అభివృద్ధికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, జిల్లా మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డిలతో సంప్రదింపులు చేసి నిధులు



సమస్యలు తెలుసుకుంటున్న మాజీ మంత్రి

కేటాయించేలా కృషి చేస్తానన్నారు. ఆయన వెంట కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు కొప్పుల వేణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ఎంపీ కిరణ్‌కుమార్‌రెడ్డి జన్మదిన వేడుకలు



అర్వపల్లి : అడివెంలలో కేక్ కట్ చేస్తున్న రేఖ ఫౌండేషన్ డైరెక్టర్, మాజీ సర్పంచ్ మద్ది పద్మ

**అర్వపల్లి:** భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్ రెడ్డి జన్మదిన వేడుకలను జాజిరెడ్డిగూడెం మండలం అడివెంల గ్రామంలో రేఖ చారిటబుల్ ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు బోయలపల్లి రేఖ ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఫౌండేషన్ డైరెక్టర్ మద్ది పద్మ, పేరెల్లి ఉపేందర్, బండారి నాగరాజు, మాదగాని అంజయ్య, జంపాల శివ, జల్లెల రమేష్, అబ్బగాని గౌతం, మేడబోయిన రమేష్, శతకోటి శైలేందర్, మద్ది శేఖర్, మచ్చ లింగయ్య, దుర్గరాజు, దస్తగిరి, లింగయ్య, రవి పాల్గొన్నారు.

**కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో..**

భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి జన్మదిన వేడుకలను మంగళవారం అర్వపల్లిలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు వేల్పుల రమేష్ , గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడు మేకల రాంబాబు, మాజీ జెడ్పీటీసీ కె. అవిలయ్య, బైరబోయిన రామలింగయ్య, బింగి శ్రీకాంత్, రమావత్ శేఖర్, అశోక్, దండ వీరారెడ్డి, మహేష్, మనోహర్, కోటిప్రసాద్, సంపత్, కనుకు రేణుక పాల్గొన్నారు.

**తిరుమలగిరి :** భువనగిరి పార్లమెంటు సభ్యుడు చామల కిరణ్‌కుమార్‌రెడ్డి జన్మదిన వేడుకలను మంగళవారం ఎమ్మెల్యే నివాస గృహంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు వై.నరేష్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నరేష్, జమ్మిలాల్, మూల అశోక్‌రెడ్డి, పాల్గొన్నారు.

**తుంగతుర్తి :** భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి జన్మదిన వేడుకలను కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీ పట్టాభి రామచంద్రస్వామి ఆలయంలో కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కేతిరెడ్డి విజయ కుమార్ రెడ్డి ,ఓరుగంటి సత్యనారాయణ, కటకం వెంకటేశ్వర్లు ,కతకం సూరయ్య ,రాంబాబు ,అజయ్ ,రాములు ,వెంకన్న ,జలంధర్ ,భాస్కర్ ,యాకన్న, రమేష్ ,రంజిత్ ,అశోక్ ,నాగయ్య ,ఎల్లయ్య ,మనోజ్ ,సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.



తిరుమలగిరి: ఎంపీ జన్మదిన వేడుకల్లో భాగంగా కేక్ కట్ చేస్తున్న నాయకులు

**మద్దిరాల :** భువనగిరి పార్లమెంట్ సభ్యుడు చామల కిరణ్‌కుమార్‌రెడ్డి జన్మదిన వేడుకలను కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ముక్కాల అవిలమల్లు యాదవ్ ఆధ్వర్యంలో మంగళవారం మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి బొబ్బిలి వెంకన్న, పాక అమృతమల్లు, మాన్‌సింగ్,మద్దెల భిక్షపతి, ఉబ్బని రఘుపతి, శ్యాంరెడ్డి పాల్గొన్నారు.

**నాగారం:** మండల కేంద్రంలో భువనగిరి పార్లమెంట్ సభ్యుడు చామల కిరణ్‌కుమార్‌రెడ్డి జన్మదిన వేడుకలను కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు తొడుసు లింగయ్య, కన్నెబోయిన వెంకటభిక్షం, జాజుల వీరయ్య, మంగదుడ్ల దశరథ పాల్గొన్నారు.

## సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

**నాగారం:** సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని స్థానిక ఏఎస్ఐ వెంకట్రాములు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించి మాట్లాడారు. సైబర్ నేరాల అనేక మంది మోసపోయి డబ్బులు పోగొట్టుకుంటున్నారని తెలిపారు. ప్రజలు తమ వ్యక్తిగత సమాచారం బ్యాంక్ వివరాలు, ఏటీఎం నంబర్లు, ఓటీపీ తదితర వాటిని బహిర్గతం చేయవద్దని అన్నారు. అపరిచిత వ్యక్తుల నుంచి ఫోన్ కాల్స్ వస్తే 100 నంబర్‌కు డైల్ చేసి పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ముకుందారెడ్డి, తొడుసు లింగయ్య, రాంమూర్తి, వలీ, పోలీసు సిబ్బంది, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు

### క్రీడా రంగంలో రాణించాలి

**తిరుమలగిరి :** గ్రామీణ యువత క్రీడా రంగంలో రాణించాలని ఎస్‌వీడీ స్పోర్ట్స్ క్లబ్ జిల్లా అధ్యక్షుడు ఇస్లావత్ నవీన్ కోరారు. మంగళవారం అనంతారం మోడల్ స్కూల్‌లో విద్యార్థులకు టీషర్ట్స్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ బాలరాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



విద్యార్థులకు టీషర్ట్స్ అందిస్తున్న ఇస్లావత్ నవీన్

### పోస్టర్ ఆవిష్కరణ

**మద్దిరాల :** హైదరాబాద్‌లో ఈ నెల 26,27,28 తేదీల్లో జరిగే ఫొటో ట్రేడ్ ఎక్స్‌పోను విజయవంతం చేయాలని జిల్లా ఫొటోగ్రఫీ అసోసియేషన్ అధ్యక్షుడు కూకుంట్ల లాలు కోరారు. మంగళవారం మండల కేంద్రంలో ఫొటో ఎక్స్‌పో కార్యక్రమం పోస్టర్‌ను ఎస్ఐ మధునాయుడు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు వంగూరి యాదగిరి, జంబారపు అశోక్, బండారి లాలు, వెంకన్న, మల్లేష్, ప్రభాకర్, నరేష్, నారాయణ, ఆనంద్ పాల్గొన్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎస్ఐ మధునాయుడు

## స్వచ్ఛతపై ప్రత్యేక దృష్టి

- వ్యాధుల నివారణకు చర్యలు
- ప్రతిరోజు డ్రెయినేజీలు శుభ్రం చేస్తున్న పంచాయతీ కార్మికులు

**పెన్‌పహాడ్:** మండలంలో గత కొద్ది రోజులుగా విస్తారంగా వానలు కురుస్తున్నాయి. ఈ నేపథ్యంలో సీజనల్ వ్యాధులు వచ్చే ప్రమాదముందని గ్రహించిన పంచాయతీ కార్యదర్శులు, ప్రత్యేకాధికారులు పారిశుద్ధ్య నిర్వహణకు శ్రీకారం చుట్టారు. పంచాయతీ సిబ్బందితో కలిసి పారిశుద్ధ్య పనుల్లో నిమగ్నమయ్యారు. ఎప్పటికప్పుడు తమ పరిధిలోని గ్రామాలను సందర్శించి ప్రజల సమస్యలు తెలుసుకుంటున్నారు. వాటి పరిష్కారానికి ప్రత్యేక చొరవ తీసుకుంటున్నారు.

**ప్రతి రెండు రోజులకోసారి...**

మండలంలో మొత్తం 29 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. మొత్తం జనాభా 36వేలు . ఆయా గ్రామ పంచాయతీల్లో ప్రతి రెండు రోజులకోసారి మురుగు కాల్వలు శుభ్రపరుస్తున్నారు. ఎక్కడా కూడా మురుగు నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. పెంటకుప్పల తొలగింపు, ప్రధాన రోడ్లకిరువైపులా పిచ్చి మొక్కలు లేకుండా చూడడం రోజు ఉదయం ట్రాక్టర్ ద్వారా నిల్వ ఉన్న చెత్తను తొలగించడం వంటి కార్యక్రమాలు చేపడుతున్నారు. మురికి నీటిలో లార్వా నివారణకు థెమోపాస్ ద్రావణం వేస్తున్నారు.



పెన్‌పహాడ్ మండల కేంద్రంలో బ్లీచింగ్ చల్లుతున్న పంచాయతీ సిబ్బంది



మురుగు కాల్వలోపూడిక తీస్తున్న పంచాయతీ కార్మికులు

**రోజువారీ కార్యక్రమాలు**

ఇప్పటికీ మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో రోజువారీ కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. ప్రతి రోజు మురికి నీటిలో ఆయిల్ బాల్స్ వేయడం, మురికి నీరు లేకుండా చేయడం, పాత టైర్లలో, డబ్బాల్లో, డ్రమ్ముల్లో మురుగు నీటిని పారబోయడం, పాడుబడిన భవనాలను కూలగొట్టడం, పాఠశాలల్లో పిచికారీలు చేయడం వంటి పనులు నిత్యం చేపడుతున్నారు. దీంతో పాటు వ్యాధుల నివారణ నిమిత్తం గ్రామీణులకు రోగాలపై అవగాహన కల్పిస్తున్నారు. మండలంలోని గ్రామాల్లో గుంతల్లో వర్షపు నీరు నిల్వ ఉన్న చోట బ్లీచింగ్ పౌడర్ పిచికారీ చేస్తున్నారు.

**పారిశుద్ధ్య నివారణకు ప్రత్యేక కార్యక్రమాలు**



అన్ని గ్రామ పంచాయతీల్లో పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాం. వర్షాకాలంలో వచ్చే వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని పంచాయతీ కార్యదర్శులకు తెలియజేశాం. ఎక్కడా కూడా చెత్తచెదారం లేకుండా చర్యలు తీసుకుంటున్నాం. స్వచ్ఛతపై దృష్టి సారించాం.

– వెంకటేశ్వరరావు ఎంపీడీఓ